
యాంత్రికంగా ఆఫీస్‌లో పనిచేస్తున్నాననే మాటేగానీ నా ఆలోచనలన్నీ రాజారావ్ కుటుంబం చుట్టే తిరగసాగాయి. రాజారావ్‌కి వచ్చిన కష్టం పగవాడిక్కూడా రాకూడదు అనుకున్నాను బాధగా మనసులో.

మేమిద్దరం ఒకే ఆఫీసులో పని చేస్తున్నా మా మధ్య స్నేహం బలపడడానికి కారణం సాహిత్యమే అని చెప్పొచ్చు. అడపా దడపా నేను వ్రాసిన కథ లు చదివి అందులో దొర్లిన లోపాల గురించి, యికపై వ్రాయబోయే రచనల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించీ విడమరిచి చెప్పేవాడు.

ఆదివారం వచ్చిందంటే చాలు... రెక్కలు కట్టుకుని వాడింట్లో వాలిపోయేవాణ్ని. వుద్ధండులు వ్రాసిన మహాకావ్యాల్నించి, లఘుకావ్యాలదాకా మా మధ్య చర్చలు సాగేవి. అవి ఎంతకీ తెగేవి కాదు.

ఈలోపు నందిని కాఫీ కప్పుల్తో ప్రత్యక్షమయ్యేది. నందినిని చూస్తే ఎవరికైనా గౌరవ భావం కలుగకమానదు. నిండైన విగ్రహం. చెయ్యెత్తు మనిషి. ఖరీదైన జరీచీర కట్టుకుని, చేతినిండా మట్టిగాజులు, మధ్యమధ్యలో బంగారుగాజులు, మెడలో మెరిసే చంద్రహారం, పావలాకాసంత కుంకుమ బొట్టూ మొహాన తీర్చిదిద్ది సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మిలా ఉండేది.

'అన్నయ్యగారూ... వదినగారూ, పిల్లలూ బావున్నారా? ఈరోజెలాగూ ఆదివారమే కదా! వదినగార్ని, పిల్లల్నీ కూడా తీసుకురావాల్సింది. వాళ్లకీ కాస్త రిలీఫ్‌గా ఉండేది... నాకూ



బెండపూడి రమేష్‌బాబు

కాలక్షేపం అయ్యేది' అంది కాఫీకప్పు అందిస్తూ.

'యీ వురుకుల పరుగుల జీవితంలో వి శ్రాంతి ఎక్కడిదమ్మా. ఆదివారమే అయినా పిల్లల్ని ట్యూషన్లకి రెడీచేయడం, చినిగిపోయిన పుస్తకాలకి అట్టలువేయడం... ఒకటేమిటి... క్షణం తీరికలేని జీవితాలైపోయాయి. అప్పటికీ నేను చెబుతూనే ఉంటాను – ఆరోగ్యం కూడా జాగ్రత్తగా చూసుకొమ్మని... కొంచెం హైరానా తగ్గించుకోమనీ... ఏదీ నా మాట వింటేనా?' అన్నాను కాఫీ కప్పు అందుకుంటూ.

'వచ్చే ఆదివారమైనా పిల్లల్నీ, వదినగార్నీ తీసుకురావాలి'.

'అలాగేనమ్మా. అయితే వచ్చే ఆదివారం కాదు. ఆపై వారం... ఎందుకంటే వచ్చేవారం నువ్వూ, రాజారావూ మా యింటికొస్తున్నారు కాబట్టి'.

కాసేపు యోగక్షేమాలు కనుక్కొని, ఏదో పనుందంటూ ఖాళీ కప్పుల్తో నందిని వంటిం ట్లోకి వెళ్లిపోయింది.

ఏదో విషయం గురించి తీవ్రంగా చర్చించు కుంటున్న సమయంలో యింట్లోకి వస్తున్న రాజా రావు కొడుకు విశ్వాన్ని చూసి విస్తుపోయాను. విశ్వం ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. షర్ట్ చిరిగిపోయి, క్రాఫ్ రేగిపోయి, కాలుచెప్పు ఒకటి తెగిపోతే కాలు యీడ్చుకుంటూ నడుస్తూ మొహాన పట్టిన చెమట చేత్తో తుడుచుకొంటూ గబగబా యిం ట్లోకి పోతున్నాడు.

కొడుకు వాలకం చూసి కూడా 'ఆ అవతా రం ఏంట్రా? ఏమైంది నీకు?' అనైనా అడక్కుం డా రాజారావు అంత నిబ్బరంగా ఉండడం నాకు ఆశ్చర్యమేసింది.

అసలు విషయం ఏమిటో కనుక్కుందామని విశ్వం రూమ్‌కేసి నాలుగు అడుగులు వేసానో లేదో నందిని ఎదురొచ్చి, 'వాడి అభిమాన హీరో సినిమా రిలీజ్ కదన్నయ్యా... ఆ సినిమా టిక్కెట్ కోసం జరిగిన యుద్ధంలో వీడి అవతారం ఇలా తగలడింది' అంది కోపంగా. ఆ మాటల్లో ఆమె బాధ అర్థమవుతూనే ఉంది.

'యింకో వారం రోజుల్లో పరీక్షలు పెట్టుకు ని సిన్మాలంటూ, షికార్లంటూ టైమ్ వేస్ట్ చేసుకో వడం ఏమిటని మందలించకపోయావామ్మా?'

'ఎన్నోసార్లు చెప్పిచూసాం. అయినా వాడి పద్ధతిలో మార్పు రావడంలేదన్నయ్యా. వాడి అభిమాన హీరో సినిమా రిలీజ్ అయ్యిందంటే చాలు... ఆ రోజంతా ఒక్కక్షణం తీరికలేకుండా యిలా బలాదూర్‌గా తిరిగొస్తాడు. అదేంట్రా అంటే యింట్లో చాలాసార్లు యుద్ధాలే జరి గాయి. ఒక్కోసారి వాడి గురించే ఆలోచిస్తూ నాలో నేను ఎంత కుమిలిపోతున్నానో ఆ దేవు డికే తెలియాలి' అందామె బాధగా. గొంతులో జీర స్పష్టంగా అర్థమవుతోంది.

'పోనీ విశ్వంతో నేను మాట్లాడి చూస్తాను'.

'వద్దన్నయ్యా. కోపంతో ఒక్కోసారి ఏం మా ట్లాడుతున్నాడో వాడికే తెలియదు'.

ఆమె భయం అర్థమయింది. అందుకే విశ్వంతో మాట్లాడే ప్రయత్నాన్ని విరమించుకుని యింటిదారి పట్టాను... ఈ అభిమానుల గురిం చి ఆలోచిస్తూ...

నిజమే. యీ అభిమానులకు హీరోలపై ఉండేది అభిమానమో, ఆరాధనో తెలియదుగా నీ, రిలీజ్ నాడే సినిమా చూడాలనే తపనా, తాపత్రయంతో ఒక్కోసారి తమ నిండు ప్రాణా ల్ని సైతం బలిపెట్టుకొనే వైనం గుర్తుకొస్తే గుండె చెరువవుతుంది. సామాజిక కార్యక్రమాలు చేపట్టే అభిమానుల్ని చూస్తే ఎవరికి మాత్రం ముచ్చటేయదు? ఇటీవల పేపర్లో చదివాను...

తమిళనాడులో ఓ హీరోయిన్‌కి ఏకంగా గుడి కట్టించారట అభిమానులు. ఎంత విడ్డూరం?

ఆలోచనల్లతో యింటికెప్పుడు చేరానో నాకే తెలియలేదు.

* * *

ఆ రోజు ఆదివారం -

రోహిణీ కార్తె కావడంతో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. లంచ్ పూర్తయిన తర్వాత టీవీ చూస్తూ లోకాభిరామాయణం మాట్లాడుకోసాగాం రాజారావూ, నేనూ.

టీవీలో వస్తున్న ఓ వార్త మమ్మల్ని టీవీకి అతుక్కుపోయేలా చేసింది. పైపెచ్చు ఆ సంఘటన మా ఊళ్లోనే జరుగుతూ ఉండడంతో చాలా థ్రిల్లింగ్‌గా అనిపించి టీవీ చూడసాగాం.

మీడియా పుణ్యమా అని క్షణాల్లో ఆ వార్త దావానలంలా రాష్ట్రం నలుమూలలా వ్యాపించింది. యిళ్లల్లో ఉన్న అభిమానులు వీధుల్లోకి వచ్చి చేరసాగారు.

తమ అభిమాన హీరో కటవుట్‌ని తగుల పెట్టినదానికి ప్రతీకారంగా వీరావేశంతో రాష్ట్రంలో చాలాచోట్ల విధ్వంసానికి పాల్పడసాగారు అభిమానులు.

వాళ్ల ఆవేశం రాళ్లరూపంలో బస్సులపై వర్షించసాగింది. బస్సుల అద్దాలు భళ్లున పగలసాగాయి.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి అంటూ ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోయసాగాయి. ప్రతిపక్షాలు అభిమానుల ఆందోళనకి తమ పూర్తి మద్దతు ప్రకటించాయి. దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని, లేకపోతే రాష్ట్రంలో జరగబోయే పరిణామాలకి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందనీ ఆందోళనకి దిగాయి.

టీవీ ఛానల్స్ ఒకదానికి మరొకటి పోటీపడి ఈ వార్తలకు యిచ్చిన ప్రాధాన్యతతో రాష్ట్ర వాతావరణం పూర్తిగా వేడెక్కింది.

అంతలో...

జనంలో ఒకటే కలకలం... ఎవ్వరూ ఊహించని సంఘటన...

హాహాకారాలు చేసుకుంటూ జనం సెల్ టవర్ దగ్గరకు వడివడిగా చేరుకోసాగారు.

అందరి మొహాల్లో ఏదో తెలియని ఉత్కంఠ. ఎపుడేం జరుగుతుందో తెలియని ఆందోళన.

తమ అభిమాన హీరోకి జరిగిన అవమానానికి నిరసనగా సెల్‌టవర్ పైనుంచి దూకేస్తామంటూ కొందరు అభిమానులు సెల్‌టవర్ ఎక్కసాగారు.

వాళ్లని కిందికి దిగిరమ్మని జనం పెట్టే కేకల్తో ఆ ప్రాంతం మార్మోగిపోతోంది.

అక్కడ ఉన్న పోలీస్ అధికారికి ఈ సమస్యనెలా పరిష్కరించాలో అర్థంకావడంలేదు.

అభిమానుల్లో అలజడి క్షణక్షణానికీ తీవ్ర రూపం దాల్చసాగింది. మీడియా తనపని తాను చేసుకుపోసాగింది. విషయానికి మసాలా దట్టించి కథలు కథలుగా లైవ్ టెలికాస్ట్ చేస్తూ వారు అక్కడి నుంచి దూకితే తల పగులుతుందా, కాళ్లు విరుగుతాయా వంటి ప్రశ్నలతో యస్సెమ్మెస్‌ల రూపంలో క్యాష్ చేసుకోసాగింది.

టవర్‌పై ఉన్న వ్యక్తులు ఆవేశంతో కిందికి దూకేస్తారేమోనని పోలీసులు సెల్‌టవర్ చుట్టూ వలలు పట్టుకుని నిలబడ్డారు. వాళ్లకి తెలుసు... అవి వాళ్లని కాపాడలేవని.

పోలీస్ అధికారి టవర్‌పై ఉన్న వ్యక్తుల్ని ఉద్దేశించి, 'కిందికి దిగిరమ్మనమని, దోషులెంతటి వారైనా శిక్షిస్తామనీ' హ్యాండ్‌మైక్‌లో చెప్పసాగాడు.

టవర్‌పై ఉన్నవాళ్లకి యివేం వినిపించడం లేదు. కింద జనం చాలా ఉద్వేగంగా ఉన్నారని మాత్రం అర్థమవుతోంది. యీ విధంగానైనా తమ ఆరాధ్యదైవం దృష్టిలో పడతామనే భావన వాళ్లని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

అభిమానులతో పాటు ప్రతిపక్షాలూ రోడ్డెక్కాయి. వాళ్ల ప్రాణాలకు హాని జరిగితే ప్రభుత్వానిదే బాధ్యతని హెచ్చరిస్తూ ధర్నాలకు దిగాయి. టీవీ ముందు కూర్చుని ఈ సంఘటనని తిలకిస్తున్న మేము ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాం. భయంతో గుండె లయ తప్పుతోంది. మా హృదయ స్పందన మాకే వినిపించసాగింది. మెదడులో నరాలు చిట్లిపోతాయేమోననే ఫీలింగ్.

టవర్‌పై ఉన్న వ్యక్తుల్లో రాజారావ్ కొడుకు విశ్వం కూడా ఉండడంతో అందరం ఉలిక్కిపడ్డాం.

నందిని శోకాలు పెట్టసాగింది.

ఒక్కక్షణం వాతావరణం భీతావహంగా మారిపోయింది.

అందరి హృదయాల్లో రక్తప్రసరణ వేగం పెరిగింది.

తెలియని భయం ఏదో ఆవహించి మమ్మల్ని వివశుల్ని చేస్తోంది.

విశ్వానికేం కాకుండా కాపాడు భగవాన్ అంటూ మనసులోనే మొక్కుకుంటూ ఒక్క ఉదుటున సెల్‌టవర్ వద్దకు చేరుకున్నాం.

వడగాడ్పు ఆ చెవి నుంచి యీ చెవికి సోకుతోంది.

వడగాడ్పుని సైతం లెక్కచేయకుండా జనం గుంపులు గుంపులుగా అక్కడికి చేరుకోసాగారు.

కొత్తగా వచ్చి చేరుతున్న వారితో గుంపు క్షణక్షణానికీ పెద్దదవుతోంది.

తల్లిదండ్రుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోతోంది.

అభిమానులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయసాగారు. తమ పిల్లల్ని క్రిందికి దిగిరమ్మనమని, ఎలాంటి అఘాయిత్యానికీ పాల్పడవద్దనీ గుండెలవిసేలా రోదిస్తూ తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. పూనకం వచ్చిన అభిమానులు సృష్టిస్తున్న వీరంగం ముందు ఆ తల్లిదండ్రుల ఆవేదన అరణ్యరోదన అయింది.

వ్యక్తి ఆరాధన ముందు పేగుబంధం చిన్నబోయింది.

తగలబడిన హీరో కటవుట్ ముందు తల్లిదండ్రుల హృదయాగ్ని జ్వాలలు చిన్నబోయాయి.

ఉన్నట్టుండి జనం కేకలు... అరుపులతో... ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది.

ఆ దృశ్యాన్ని క్లోజప్‌లో చూపించడానికి టీవీ ఛానల్స్ ఒకదానిని మించి మరొకటి పోటీ పడసాగాయి.

ఆ దృశ్యాన్ని చూసే గుండెదిటవులేని కొన్ని వందల జతల కళ్లు ప్రక్కకి తప్పుకున్నాయి.

టవర్‌పై నుంచి గాలిలో తేలుతూ విశ్వం...

నందిని స్పృహతప్పి పడిపోయింది.

రాజారావ్ పిచ్చివాడిలా కొడుకు శవంపై పడి పొర్లిపొర్లి ఏడుస్తున్న దృశ్యం అక్కడ చేరిన వారి గుండెల్ని పిండేస్తోంది. పోయిన విశ్వానికేం తెలుస్తుంది ఆ తల్లిదండ్రుల గుండెకోత? ఎ.సి. గదిలో కూర్చుని కొత్త సినిమాకు సైన్ చేస్తున్న హీరోగారు కొంత డబ్బిచ్చి విశ్వం తల్లిదండ్రులకు సానుభూతి తెలిపిన విషయమైనా విశ్వానికి తెలుస్తుందా?

ఈ అభిమానులు ఒక్కక్షణం ఆలోచిస్తే తల్లిదండ్రులకీ గుండెకోత ఉండదుకదా అనుకున్నాను మూగగా నాలో నేనే రోదిస్తూ. ●